# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-02-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భాషా అడ్డంకులను అధిగమించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **వికసిత్ భారత్ ఆశయాలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్ దీప్ సింగ్ పూరీ తెలిపారు.**
3. **ఉమ్మడి పాలమూరు జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని తెలంగాణా ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి వెల్లడించారు.**
4. **మహిళల రక్షణ కోసం 'సురక్ష' పేరుతో ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు.**
5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

భాషా అడ్డంకులను అధిగమించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహించిన అఖిలభారత మరాఠీ సాహిత్య సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ మాట్లాడుతూ.. మరాఠి భాష సాహిత్యం ద్వారా భక్తి ఉద్యమంలో సాధు పుంగవులు సమాజానికి కొత్త దిశను చూపించారని తెలిపారు. ప్రతీ భాషకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని పేర్కొన్నారు.

--------------------------

వికసిత్ భారత్ ఆశయాలకి అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్ దీప్ సింగ్ పురీ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన కేంద్ర బడ్జెట్ 2025-26 పై మేధావుల సమావేశంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ అంశాలకు ప్రాధాన్యతనిచ్చామని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన అంగూల్ -శ్రీకాకుళం గ్యాస్ పైప్ లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని కేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..34 సెకన్లు

--------------------------

ఉమ్మడి పాలమూరు జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని తెలగాణా ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. నారాయణపేట జిల్లా అప్పకపల్లిలో ఇందిరమ్మ ఇళ్లతో పాటు, వైద్య కళాశాల , వసతి గృహాల నిర్మాణానికి ముఖ్యమంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధి కోసం రాష్ట్ర బడ్జెట్ లో ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3 వేల 5 వందల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించిందని రేవంత్ రెడ్డి తెలుపుతూ,

వాయిస్..21 సెకన్లు

---

మహిళల రక్షణ కోసం 'సురక్ష' పేరుతో ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో ఆమె నిన్న ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహిళల భద్రత కోసం అన్ని జిల్లాల్లో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి జిల్లాలో సురక్ష బృందాలను నియమించి భద్రత పెంచాలని, పోక్సో కేసుల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చూడాలని చెప్పారు. 112 మరో నెంబరు 181 అదేవిధంగా మరో నెంబరు 1098 వంటి హెల్ప్‌లైన్ల నంబర్లపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి తెలిపారు.

---

గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా జిన్నూరు గ్రామంలో చేపట్టిన వంతెన అప్రోచ్, రక్షిత మంచినీరు వంటి అభివృద్ధి పనులను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ..26 సెకన్లు

---

1857 నాటి మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామానికి పదేళ్లముందే బ్రిటీష్ పాలనను ఎదిరించి తిరుగుబాటు చేసిన రేనాటి తెలుగు వీరులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి ఈరోజు. 1806వ సంవత్సరం నవంబరు 24న రూపనగుడి గ్రామంలో ఆయన జన్మించారు. కడపజిల్లా ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన దొరవారి నరసింహారెడ్డి ఆంగ్లేయులపై తిరుగుబాటు బావుట ఎగురవేశారు. 1847 ఫిబ్రవరి 22వ తేదిన కోవెలకుంట్లలో బ్రిటీష్‌వారు ఆయనను ఉరితీశారు. ఉరికొయ్యను ముద్దాడి భావిభారత జాతీయోద్యమానికి ఆయన స్ఫూర్తిగా, దిక్సూచిగా నిలిచారు. బ్రిటీష్ పాలకులను ఎదిరించిన తొలి స్వాతంత్ర్య సమరయోధులుగా నరసింహారెడ్డి చరిత్రలో మిగిలిపోయారు.

---

తెలంగాణలో ఎరువులకు కొరత లేదని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఎరువుల పంపిణీపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల అవసరాల మేరకే ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్రానికి ఈ నెలలో రావాల్సిన యూరియాను వెంటనే

సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. ప్రస్తుతం ఉన్న 1.30 లక్షల టన్నుల ఎరువులను అవసరాల మేరకు జిల్లాలకు సరఫరా చేస్తున్నామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనూ మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఏప్రిల్ నెలలో మత్స్యకార భరోసా కింద 20 వేల రూపాయలు అందిస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల మరమ్మత్తుల పనులు జరుగుతున్నాయని మంత్రి పేర్కొంటూ,

వాయిస్... 33 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

---------------------------

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, మహాత్మాగాంధీ సతీమణి కస్తూర్భా గాంధీ వర్ధంతి ఈ రోజు. 1869 ఏప్రిల్ 11 వ తేదీన గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించిన ఆమె.... స్వాతంత్ర్య పోరాటంలోని అన్ని దశల్లోనూ ఉత్సాహంగా పాల్గొన్నారు. గాంధీజీ నిర్వహించిన క్విట్ ఇండియా ఉద్యమంలో కూడా చురుకుగ్గా పాల్గొన్నారు. 1944 ఫిబ్రవరి 22వ తేదీన ఆమె కన్నుమూశారు. కస్తూరి బా గాంధీ.... అన్ని దశల్లో భర్త అడుగుజాడల్లో నడుస్తూ.. ఆదర్శ మహిళగా నిలిచారు.

---------------------------

ఈ రోజు ప్రపంచ స్కౌట్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. బ్రిటన్‌కు చెందిన సర్ రాబర్ట్ బడెన్ పోవెల్ జయంతిని ప్రపంచ స్కౌట్స్ దినోత్సవంగా పాటిస్తున్నారు. 1857 ఫిబ్రవరి 22వ తేదీన బ్రిటన్‌లో జన్మించిన ఆయన....దక్షిణాఫ్రికాలో 1907వ సంవత్సరంలో జరిగిన యుద్ధాలలో గాయపడిన వారికి అకుంఠిత సేవలు అందించారు. యుద్ధ బాధితులకు చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతిని ప్రపంచ స్కౌట్స్ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా ‘లేపాక్షి’ దుకాణాల నిర్మాణాలను చేపట్టనున్నామని చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థలు మంత్రి సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న లేపాక్షి దుకాణాలను ఆధునీకరించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నామని చెప్పారు.

=====================